క్లుప్తంగా

హక్కుల కోసం కలిసికట్టుగా పోరాడాలి



హన్సరాజ్ అహీర్‌తో రాజేంద్రనగర్ ఓబీసీ నాయకులు

రాజేంద్రనగర్: బీసీల హక్కుల కోసం అందరూ కలిసికట్టుగా పోరాడాలని జాతీయ బీసీ కమిషన్ చైర్మన్ హన్సరాజ్ అహీర్ వెల్లడించారు. భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ బీజేపీ నాయకులు ఆయనను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఓబీసీ మెర్చా అధ్యక్షులు నాగేశ్వర్‌రావు, ప్రధాన కార్యదర్శి సులిగే వెంకటేష్, వాసు, హరికిషన్‌జీ, నేరుట్ల జగన్ తదితరులున్నారు.

నేడు జాబ్ మేళా

విజయనగర్‌కాలనీ: రంగారెడ్డి జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో నేడు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి అధికారి జయశ్రీ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఏయిర్ ఇండియా సార్ట్స్ ఏయిర్‌పోర్టు సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్, మిత్ర ఏజెన్సీ తదితర సంస్థల్లోని 290 డ్రైవర్లు, హెల్పర్స్ (పురుషులు), సేల్స్ ఎగ్జిక్యూటీవ్ తదితర ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియేట్, ఐటీఐ, ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండి 18 నుంచి 30 ఏళ్ల లోపు అభ్యర్థులు అర్హులన్నారు. ఎంపికైన వారికి ప్రారంభ నెలసరి వేతనం రూ.14 వేల నుంచి అర్హత నైపుణ్యాన్ని అనుసరించి రూ.18 వేలతో పాటు ఇతర ఇన్‌సెంటీవ్స్ ఉంటాయన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు సోమవారం ఉదయం 10.30 గంటలకు ఫొటోలు, సర్టిఫికెట్లతో విజయనగర్ కాలనీలోని రంగారెడ్డి జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయంలో హాజరుకావాలన్నారు. వివరాలకు 90630 99306, 96763 79303 లలో సంప్రదించవచ్చు.

కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందేలా కృషి

జియాగూడ: కేంద్ర ప్రభుత్వ పథకాలు ప్రజలకు అందే విధంగా కృషి చేస్తానని బీజేపీ కేంద్ర ప్రభుత్వ పథకాల కన్వీనర్ మనోహర్ థాకరే అన్నారు. ఈ మేరకు ఆదివారం గోల్కొండ జిల్లా బీజేపీ అధ్యక్షుడు పాండుయాదవ్ చేతుల మీదుగా నియామకపత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా మనోహర్ ప్రసాద్ థాకరే మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలపై అవగాహన లేనందునా ప్రజలు ఎంతో నష్టపోతున్నారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవగాహన కలిగే విధంగా ప్రతి నియోజకవర్గంలో ప్రభుత్వ పథకాలకు సంబంధించిన అధికారులను నియమించి ప్రజలకు అవగాహన కల్పించి ప్రోత్సాహించాలన్నారు. ముఖ్యంగా ముద్ర, ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్, ఎంఎస్ఎంఈ తదితర సంక్షేమ పథకాలు ప్రజలకు అందేవిధంగా పాటు పడుతానన్నారు.

ఏప్రిల్ 8న 'బ్యాండ్ కాన్సర్ట్'



రాయదుర్గం: అనాథలు, వృద్ధులు, అండర్ ప్రివిలేజ్ వారికి సహాయం చేసేందుకు నిధుల సేకరణకు 'స్ట్రీట్ కాజ్', హైదరాబాద్ యూత్ అసెంబ్లీ సంస్థలు ఆదివారం గచ్చిబౌలిలోని ట్రిపుల్‌ఐటీ హైదరాబాద్ క్యాంపస్‌లో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏప్రిల్ 8వ తేదీన ఎల్‌బీ స్టేడియంలో ప్రఖ్యాత కళాకారుడు అర్మాన్ మాలిక్, కెప్రిశియో బ్యాండ్ కాన్సర్ట్‌ను ప్రదర్శించాలని ఈ సందర్భంగా నిర్ణయించారు. ఈ కాన్సర్ట్‌తో వచ్చే నిధులతో సమాజంలోని ఎక్కువ మందికి సహాయం చేయాలని నిర్ణయించారు.

మేయర్ రాజీనామా చేయాలి



బషీర్‌బాగ్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న రోహిత్

గన్‌ఫౌండ్రీ: అంబర్‌పేటలో నాలుగేళ్ల బాలుడిని వీధి కుక్కలు కరిచి చంపిన ఘటనపై మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, మేయర్ గద్వాల విజయలక్ష్మి చేసిన వ్యాఖ్యలు బాధాకరమని యువజన కాంగ్రెస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మోతే రోహిత్ అన్నారు. మేయర్ వ్యాఖ్యలను నిరసిస్తూ ఆదివారం నగరంలోని పలుచోట్ల నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. స్థానికంగా ఉన్న వీధి కుక్కలను పట్టుకుని వినూత్న పద్ధతిలో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నాలుగేళ్ల బాలుడిపై అనుచిత వ్యాఖ్యలు చేసిన మేయర్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. వీధి కుక్కల నియంత్రను తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నగర నాయకులు పాల్గొన్నారు.

హరితహారం..

నర్సరీల్లో మొక్కల పెంపకం

- పంచాయతీకి పది వేల మొక్కలు లక్ష్యం
- వర్షాకాలంలో పంపిణీకి చర్యలు



బహదూర్‌గూడలో షేడ్‌నెట్ నీడలో నర్సరీలో మొక్కల పెంపకం

శంషాబాద్ రూరల్: హరితహారంలో భాగంగా నాటే మొక్కల పెంపకం కోసం ఏర్పాట్లు కొనసాగుతున్నాయి.. ఉపాధి హామీ నిధులతో పంచాయతీకి ఒకటి చొప్పున నర్సరీల నిర్వహణ చేపట్టారు. నిర్దేశించిన లక్ష్యాన్ని చేరుకోవడంతో పాటు ఇప్పటి వరకు నాటకుండా మిగిలిన మొక్కల సంరక్షణను నర్సరీల్లో చేపడతున్నారు. మండలంలోని 27 పంచాయతీల్లో పది వేల మొక్కలు లక్ష్యంగా నర్సరీల నిర్వహణ సాగుతోంది.

పంచాయతీకి ఐదు వేల మొక్కలు..

ప్రతి పంచాయతీ పరిధిలోని నర్సరీల్లో 2022–23 సంవత్సరానికి గాను ఐదు వేల మొక్కలను పెంచాలని నిర్ణయించారు. ఇందుకు మట్టి బ్యాగుల్లో ఇప్పటికే విత్తనాలు నాటారు. వీటికి తోడు గత ఏడాది పెంచిన మొక్కల్లో నాటకుండా మిగిలిన మొక్కలను కూడా కలిపి పది వేల వరకు మొక్కలను పెంచుతున్నారు. గత ఏడాది పంచాయతీకి నర్సరీల్లో 18 వేల మొక్కలను లక్ష్యంగా పెంపకం చేపట్టగా.. ప్రస్తుతం పది వేల మొక్కలను పెంచుతున్నారు.



మదన్‌పల్లి కొత్తతండాలో నర్సరీలో పెంచుతున్న మొక్కలు

పూలు, పండ్ల మొక్కలు..

నర్సరీల్లో వివిధ రకాల పూలు, పండ్ల మొక్కలను పెంచుతున్నారు. ఇంటికి ఐదు చొప్పున వీటిని పంపిణీ చేయనున్నారు. జామ, అల్లనేరేడు, దానిమ్మ, మల్బరీ పండ్ల రకాలతో పాటు గుల్ మొహర్, టెకోమా పూల మొక్కలే కాకుండా కరివేపాకు, మునగ మొక్కలను నర్సరీల్లో పెంచుతున్నారు. ఆయా గ్రామాల్లో డిమాండ్‌ను బట్టి 500 నుంచి 1000 మొక్కల వరకు కరివేపాకు, మునగ మొక్కల పెంపకం చేపట్టారు.

ఉపాధి హామీ నిధులతో..

నర్సరీల నిర్వహణకు ఉపాధి హామీ నిధులను వెచ్చిస్తున్నారు. నర్సరీలో మౌలిక వసతుల కల్పన పంచాయతీ పరిధిలో ఉండగా.. మొక్కల పెంపకం కోసం కూలీలకు వేతనం, ఇతర వ్యయాలను ఉపాధి హామీ నిధులతో చేపడుతున్నారు. మొక్కల పెంపకం కోసం కావాల్సిన మట్టి, ఎరువుతో పాటు విత్తనాలు ఖరీదుతో పాటు నర్సరీ నిర్వహణ కోసం రోజూ ఒక కూలీ వేతనం చెల్లిస్తున్నారు.

బృహత్ వనాల్లో మొక్కలు నాటించాం..



గత ఏడాది నర్సరీల్లో పెంచిన మొక్కల్లో చాలా వరకు బృహత్ ప్రకృతి వనాల్లో నాటించాం. మండలంలో మూడు బృహత్ వనాలు ఉండగా.. గత ఏడాది మల్కారం, రామంజాపూర్ పరిధిలోని అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన వనాల్లో దాదాపు 57 వేల మొక్కలను నాటారు. అంతకు ముందు శంకరాపురంలోని వనంలో 31వేల మొక్కలను నాటించారు. నర్సరీల్లో పెంచుతున్న మొక్కలను వర్షాకాలంలో పంపిణీ చేస్తాం.

– వసంతలక్ష్మి, ఎంపీడీఓ, శంషాబాద్

'వైఎస్ఆర్‌టీపీతోనే రాజన్న రాజ్యం సాధ్యం'



కేతావత్‌దేవి

రాజేంద్రనగర్: వైఎస్ఆర్‌టీపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ స్వయం సహాయక సంఘాల మహిళా అధ్యక్షురాలిగా కేతావత్‌దేవి నియమితులయ్యారు. ఈ మేరకు స్వయం సహాయక సంఘాల రాష్ట్ర కో ఆర్డినేటర్ అన్ను చైతన్యరెడ్డి చేతుల మీదుగా ఆమె నియామక పత్రాన్ని అందుకున్నారు. ఆదివారం రాజేంద్రనగర్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. రాజన్న రాజ్యం రావాలంటే వైఎస్ఆర్‌టీపీతోనే సాధ్యమన్నారు. వైఎస్ షర్మిల నాయకత్వంలోనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్నారు. తనపై ఎంతో నమ్మకంతో రాజేంద్రనగర్ నియోజకవర్గం స్వయం సహాయక సంఘాల మహిళా అధ్యక్షురాలిగా నియమించినందుకు పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

'వివాదాస్పద భూములకు ఎమ్మెల్యేకు సంబంధం లేదు'

శంషాబాద్ రూరల్: సుల్తాన్‌పల్లి సర్వే నంబర్లు 129, 142లో ఉన్న వివాదాస్పద భూమికి రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్‌కు ఎలాంటి సంబంధం లేదని సర్పంచు దండు ఇస్తారి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ప్రతిపక్ష పార్టీలు రాజకీయంగా ఎమ్మెల్యేను ఎదుర్కోలేక ఈ వివాదాస్పద భూముల్లోకి ఎమ్మెల్యేను లాగుతున్నారని ఆరోపించారు. సర్వే నంబరు 142లో 84 మంది నిరుపేదలకు అప్పట్లో ప్రభుత్వం ఇళ్ల పట్టాలు ఇచ్చిందని, ఈ వివాదంపై కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. ఈ సమావేశంలో వార్డు సభ్యులు ఎం.కృష్ణ, బి.చంద్రశేఖర్, అరుంధ, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి

మైలార్‌దేవ్‌పల్లి: ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్నారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ శ్రీసాయి మోడల్ స్కూల్‌లో అగర్వాల్ సేవా దళ్, బద్రివిషల్ ట్రస్ట్, నిర్మల్ దేవి ఛారిటీ ట్రస్ట్ సంయుక్తంగా ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తుందన్నారు. బస్తీ దావాఖానాలను ఏర్పాటు చేసి పేద ప్రజలకు అండగా నిలుస్తుందన్నారు. ప్రజల ఆరోగ్యం కోసం అగర్వాల్ సేవా దళ్, బద్రివిషల్ ట్రస్ట్, నిర్మల్ దేవి ఛారిటీ ట్రస్ట్ సంయుక్తంగా ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రేమ్‌గౌడ్, రఘుయాదవ్, సరికొండ వెంకటేష్, రాజేష్ పాల్గొన్నారు.



వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

సిద్ధిఖీనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా బస్వరాజ్



గచ్చిబౌలి: కొండాపూర్ డివిజన్ పరిధిలోని సిద్ధిఖీనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా రెండోసారి కె.బస్వరాజ్ ఎన్నికయ్యారు. ఆదివారం జరిగిన ఎన్నికలలో 608 ఓట్లు పోల్ కాగా 208 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా ఎం.గణేష్, కోశాధికారిగా ఎస్.రాము ఎన్నికయ్యారు. బస్తీలో మౌళిక వసతుల కల్పనకు కృషి చేస్తానని బస్వరాజ్ పేర్కొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

చాంద్రాయణగుట్ట: లాల్‌దర్వాజా సింహవాహిణి మహంకాళి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన 2023 వార్షిక కేలండర్‌ను ఆదివారం సరస్వతీ ఉపాసకులు దైవాజ్ఞ శర్మ సమక్షంలో కేంద్ర మాజీ మంత్రి, ఐడీసీ చైర్మన్ డాక్టర్ వేణుగోపాల చారి ఆవిష్కరించారు. లాల్‌దర్వాజా సింహవాహిణి మహంకాళి ఆలయ ఫోర్‌మెన్ కమిటీ అమ్మవారి నవదుర్గ రూపాలతో రూపొందించిన కేలండర్‌ను వేణుగోపాల చారి పంపిణీ చేశారు. ఫోర్‌మెన్ కమిటీ చైర్మన్లు పోసాని సురేందర్ ముదిరాజ్, బద్రీనాథ్ గౌడ్, మాజీ చైర్మన్లు కాశీనాథ్ గౌడ్, విష్ణు గౌడ్, విజయ్ కుమార్, సి.వెంకటేశ్, పోసాని సదానంద్ పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదం

బండ్లగూడ: నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు దోహదపడుతాయని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ మహేందర్‌గౌడ్ వెల్లడించారు. 18వ డివిజన్‌లోని ఓంనగర్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాలపై ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీపీ వెంకట్రాములు, రాజేంద్రనగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ పవన్‌కుమార్, ఎస్సై ఖలీల్‌పాషాతో కలిసి మేయర్ మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. నేరాలను అదుపు చేయడంలో సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. అందుకు గాను వ్యాపారదారులు, దుకాణదారులు తప్పకుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సురేష్‌గౌడ్, ఓంనగర్ కాలనీ వాసులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మేయర్ మహేందర్‌గౌడ్

భక్తిశ్రద్ధలతో బోనాల ఉత్సవాలు

గౌలిపురా: బొడ్రాయి ఆలయంలో ఆదివారం బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పోతురాజుల నృత్యాలు.. డప్పు చప్పుళ్ల మధ్య బోనాలను సమర్పించారు. గౌలిపురా బొడ్రాయి ఆలయ ముఖద్వారం నిర్మాణం పూర్తయిన సందర్భంగా ఆదివారం ఉదయం బొడ్రాయి ఆలయం నుంచి గౌలిపురా మహంకాళి మాతేశ్వరి భరత మాత ఆలయం వరకు ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి పట్టు వస్త్రాలు, ఒడి బియ్యాన్ని సమర్పించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అమర్‌నాథ్ గౌడ్, చంద్రమోహన్, టి. భాస్కర్, జానకీరామ్ పాల్గొన్నారు.

దళితులకు అండగా కేసీఆర్ ప్రభుత్వం

అబిడ్స్: దళితులకు అండగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందని రాష్ట్ర టెక్నాలజీ సర్వీసెస్ చైర్మన్ జగన్మోహన్‌రావు పేర్కొన్నారు. గోషామహల్ పరిధిలోని చుడిబజార్, అంబేద్కర్‌నగర్, దేవీనగర్ బస్తీల్లో గడ్డం గంగాధర్ ఫౌండేషన్ చైర్మన్ గడ్డం శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన దళితవాడలో బస యాత్ర కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దళితుల కోసం సీఎం కేసీఆర్ ప్రభుత్వం పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి దళితులకు అండగా నిలిచిందన్నారు. అనంతరం గడ్డం శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ.. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అన్ని వర్గాల ప్రజలకు పలు సేవా కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. విద్యార్థులకు సైతం తాము అండగా ఉండి వారికి అన్నివిధాలుగా సహకారాలు అందిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తిర్మలేష్, గణేష్, రాజేష్, సూరి, దానం శేఖర్, రాములు, గోపి, ఎల్లయ్య, శ్రీను, మహిళా నాయకురాళ్లు భారతి, సంతోషి, సుశీల తదితరులు పాల్గొన్నారు.



దళితవాడ బస యాత్రలో జగన్మోహన్‌రావు, గడ్డం శ్రీనివాస్ యాదవ్

ఎయిర్‌పోర్టులో అనారోగ్యంతో ఉద్యోగి మృతి

శంషాబాద్: ఎయిర్‌పోర్టులో ఎల్అండ్‌టీ సంస్థలో పనిచేస్తోన్న ఓ ఉద్యోగి అనారోగ్యంతో మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. బిహార్‌కు చెందిన సోహైల్ (30) ఎల్అండ్‌టీ విభాగంలో పోర్టర్‌గా మూడు నెలలుగా పనిచేస్తున్నాడు. మూడు రోజుల కిందట అనారోగ్యం బారిన పడడంతో దగ్గమందు తాగాడు. తీవ్ర అస్వస్థకు గురికావడంతో అతడిని ఉస్మానియా ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పరామర్శ

అఫ్జల్‌గంజ్: భాగ్యనగర గణేష్ ఉత్సవ సమితి వ్యవస్థాపక సభ్యుడు పుత్రాజ్ జోషి అకాల మృతి బాధాకరమని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. జోషి భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి వ్యస్థాపనలో ఆలె నరేంద్రతో కలిసి తీవ్రంగా కృషి చేశారన్నారు. ఆయన అకాల మృతి తనను కలచి వేసిందని వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

సత్ఫలితాలిస్తున్న 'హరితహారం'

గోల్కొండ: ప్రతి ఏటా నిర్వహిస్తున్న హరితహార కార్యక్రమం మంచి ఫలితాలు ఇస్తోంది. హరితహారంలో నాటిన మొక్కలను పరిరక్షించడంతో అవి నేడు చూపరులను ఇట్టే ఆకట్టుకుంటున్నాయి. గోల్కొండ ఏరియా ఆస్పత్రిలో లేబర్ వార్డు ముందున్న పూతోట ఎంతో ఆకర్షణీయంగా కానవస్తుంది. గతంలో తాము నిర్వహించిన హరితహారంలో మొక్కలను నాటామని, వాటిని ప్రతినిత్యం నీరుపోసి పెంచడం వల్లే అవి ఏపుగా పెరిగాయని గోల్కొండ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మజహర్ ఉల్లా అన్నారు. ఆస్పత్రిలో మొక్కల పరిరక్షణ కోసం ఖాదర్ బిన్ ఈతను నియమించడం జరిగిందని ఆయన తెలిపారు.

పర్యావరణంపై చిత్రలేఖనం పోటీలు

నాంపల్లి: కళలు సంస్కారాన్ని, సమర్థతను పెంచుతాయని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ.రమణాచారి అన్నారు. ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ఆదివారం నాంపల్లి పబ్లిక్‌గార్డెన్స్‌లోని జవహర్ బాలభవన్‌లో బాలలకు పర్యావరణంపై చిత్రలేఖనం పోటీలు జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కేవీ.రమణాచారి హాజరై మాట్లాడారు. నేడు పర్యావరణం తీవ్ర సంక్షోభంలో ఉందన్నారు. బాల్యం నుంచే పర్యావరణం పట్ల అవగాహన పెంచుకోవడమే పరిష్కార మార్గమని సూచించారు. చిత్రలేఖనం పోటీల్లో విజేతలైన విద్యార్థులకు జూన్ 5న పర్యావరణ దినోత్సవం సందర్భంగా బహుమతులు అందజేస్తామని ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు రంగయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కన్జర్వేటర్ ఫారెస్ట్ అధికారి కొండా మోహన్, సీనియర్ పాత్రికేయులు బీవీ.ప్రసాద్, సీసీ డైరెక్టర్ వాసు, ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ గౌరవాధ్యక్షులు ఉప్పల వెంకటేష్ గుప్తా పాల్గొన్నారు.



నేటి నుంచి నల్ల పోచమ్మ ఆలయంలో పూజలు

మణికొండ: లాలమ్మ గార్డన్ కాలనీలో నూతనంగా నిర్మించిన నల్ల పోచమ్మ ఆలయ ప్రతిష్ఠాపన పూజలు నేటి నుంచి ప్రారంభం కానున్నాయి. పూజల్లో మొదటి రోజు సోమవారం ఉదయం 8 గంటలకు గురువందనం, గణపతిపూజ, పుణ్యావాచనము, దీక్షాధారణ, అంకురారోపనము, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన, మండప అవాహనము పూజలను నిర్వహిస్తామని అర్చకులు మనోహర్‌శర్మ, రాజు శర్మలు తెలిపారు. సాయంత్రం 6గంటలకు స్థాపిత దేవతా హవనములు, పారాయణము, మహాజలాధివాసము, హారతి కార్యక్రమాలు ఉంటాయన్నారు. రెండవ రోజు మంగళవారం ఉదయం స్వస్తివాచనము, స్థాపిత దేవతా అర్చనలు, నవగ్రహ, మాత్రుక, యోగిని, రుద్రహవనము, అమ్మవారికి సప్తధాన్యాధివాసము, హారతి పూజలతో పాటు సాయంత్రం 5 గంటలకు మూలవిరాట్ గ్రామసేవ, 6 గంటలకు స్థాపిత దేవత హోమాలు, అర్చనలు, మూలమంత్ర తర్పణము, మహాపూజ, శయాధివాసము పూజలు ఉంటాయన్నారు. మూడవ రోజు 1వ తేదీన ఉదయం 7.05 గంటలకు స్వస్తి వాచనము, స్థాపిత దేవతా పూజలు, మూలమంత్ర హవనము, ప్రతిమ సంస్కారం, 7.46 గంటలకు యంత్ర, విగ్రహ ప్రతిష్ఠ, ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమాలు ఉంటాయని, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆలయ ధర్మకర్తలు బుద్దోలు లాలమ్మ, లక్ష్మయ్య కుటుంబ సభ్యులు కోరారు.



పూజలకు సిద్ధమయిన నల్ల పోచమ్మ ఆలయం

శ్యామ్ స్టీల్ బ్రాండ్ అంబాసిడర్‌గా విజయ్ దేవరకొండ



శ్యామ్ స్టీల్ డైరెక్టర్లతో విజయ్ దేవరకొండ

మణికొండ: ప్రైమరీ టీఎంటీ బార్‌ల ఉత్పత్తిదారులైన ప్రముఖ సంస్థ శ్యామ్ స్టీల్‌ను తెలుగు రాష్ట్రాలలో విస్తరించే క్రమంలో సినీ హీరో విజయ్ దేవరకొండను అంబాసిడర్‌గా నియమించుకున్నట్లు సంస్థ డైరెక్టర్లు మేఘా బెరివాల, సర్వేశ్ బెరివాల తెలిపారు. ఆదివారం మణికొండలో ఆయనతో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ దేవరకొండ మాట్లాడుతూ.. రాబోయే రోజుల్లో శ్యామ్ స్టీల్‌ను రెండు తెలుగు రాష్ట్రాల్లో విస్తరించేందుకు తనవంతు కృషి చేస్తామన్నారు.

పదవీ విరమణ

రాజేంద్రనగర్: రాజేంద్రనగర్‌లోని ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర విశ్వవిద్యాలయం డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్ డాక్టర్ ఆర్.జగదీశ్వర్ ఆదివారం పదవీ విరమణ చేశారు. వరి పరిశోధన సంస్థ హెడ్ రఘురామిరెడ్డి ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, టీచింగ్, నాన్‌టీచింగ్ సిబ్బంది పాల్గొన్నారు.



పదవీ విరమణ చేసిన డాక్టర్ జగదీశ్వర్‌ను సన్మానిస్తున్న దృశ్యం

'బీఆర్ఎస్ మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్తున్నాం'



సమావేశంలో మాట్లాడుతున్న మోండ్ర కొమురయ్య

మైలార్‌దేవ్‌పల్లి: బీఆర్ఎస్ మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్తున్నాం బీజేపీ నాయకుడు మోండ్ర కొమురయ్య వెల్లడించారు. మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బృందావన్ కాలనీలో శక్తి కేంద్రం ఇన్‌చార్జి రావుల భాస్కర్ ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్‌ను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజల సమస్యలను గాలికి వదిలేసి బీఆర్ఎస్ ప్రభుత్వం తమ సొంత ప్రయోజనాలను చూసుకుంటుందన్నారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారని, రానున్న రోజుల్లో బీఆర్ఎస్‌కు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు జనార్దన్, మురళీధర్‌రెడ్డి, బొమ్మ రాజు నర్సింహారాజు, సంతోష్‌గౌడ్, వెంకటరమణగుప్తా, మధుసుధన్‌రెడ్డి, పాండుయాదవ్, కొవ్వకుల బాబు పాల్గొన్నారు.

పర్యావరణ మార్పులతోనే అనేక వ్యాధులు

శేరిలింగంపల్లి: మారిన జీవనశైలిలో పర్యావరణంలో వస్తున్న అనేక మార్పుల వల్ల అనేక వ్యాధులకు ప్రజలు గురవుతున్నారని వైద్యులు స్పష్టం చేశారు. శేరిలింగంపల్లి డివిజన్ హుడా ట్రేడ్ సెంటర్‌లోని శ్రీసీతారామంజనేయ దేవాలయం ఆవరణలో సిటిజన్ ఆస్పత్రి, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్ ఫిజీషియన్ డాక్టర్ రాహుల్, డెంటల్ డాక్టర్ షబ్బీర్, ఈఎన్‌టీ డాక్టర్ అంజద్, నేత్రవైద్యులు డాక్టర్ వైదేహి మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం కావున కొన్ని జాగ్రత్తలు తీసుకున్నచో మన ఆరోగ్యం మన చేతుల్లోనే ఉంటుందన్నారు. ప్రతి ఒక్కరూ నిత్యం వ్యాయామం, మెడిటేషన్, యోగ, ధ్యానం, నడక మొదలైనవి కనీసం 40 నిమిషాల పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ టి రామస్వామియాదవ్, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు శ్రీరామచంద్రమూర్తి, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



హుడా ట్రేడ్ సెంటర్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించిన దృశ్యం